# సాక్షి
## పార్వతీపురం మన్యం

శుక్రవారం । 14 । జూన్ । 2024






**'సిరి'ధాన్యాలు**

చిరు ధాన్యలతో కూడిన ఆహార పదార్థాలతో ఆరోగ్యం సిద్ధిస్తుందన్నది వైద్యుల మాట. వినియోగం పెరగడంతో చిరుధాన్యాలు సాగుచేసే రైతులకు సిరులు కురుస్తున్నాయి. - 8లో



**రక్తదానంతో పునర్జన్మ..**

మనిషి ప్రాణాలు నిలబెట్టి పునర్జన్మనిచ్చే రక్తదానం కంటే మించినది లేదు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్నారు. - 8లో

**పదవికి రాజీనామా**



సంతకవిటి: రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేసినట్టు వాల్తేరు గ్రామానికి చెందిన గురుగుబెల్లి స్వామినాయుడు గురువారం తెలిపారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని స్థానిక విలేకరులకు చూపించారు.

## న్యూస్‌రీల్

### అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అభినందన



ఐక్యరాజ్య సమితికి అప్‌లోడ్ చేసిన మొక్కలు నాటే ఫొటో

సీతంపేట: శ్రీకాకుళంలోని ఆర్‌జీయూకేటీ (ట్రిపుల్ ఐటీ)లో బయోసైన్స్ విభాగంలో పని చేస్తున్న సీతంపేటకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ గేదెల రవిని ఐక్యరాజ్య సమితి పర్యావరణ విభాగం అధికారులు అభినందించారు. ప్రపంచ వ్యాప్తంగా జూన్ 5వ తేదీన ఎన్విరాన్‌మెంట్ డే నిర్వహణ కోసం మొక్కలు నాటి రిజిస్ట్రేషన్ చేయాలని యూఎన్‌ఓ పర్యావరణం విభాగం పిలుపునిచ్చింది. గోగ్రీన్ పేరిట ట్రిపుల్ ఐటీలో మొక్కలను నాటి ఆ ఫొటోలను ఆయన అప్‌లోడ్ చేశారు. వాటిని పరిశీలించిన యూఎన్‌ఓ బృందం రవి కృషికి అభినందనలు తెలుపుతూ పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని కోరారు.

### పాత మార్కొండపుట్టిలో గజరాజులు



పాత మార్కొండపుట్టి పరిసరాల్లో సంచరిస్తున్న గజరాజుల గుంపు

కొమరాడ: మండలంలోని పాత గుణానపురం -పాత మార్కొండపుట్టి గ్రామాల మధ్య ఏడు గజరాజుల గుంపు గురువారం సంచరించింది. రెండు గ్రామాల ప్రజలు రాత్రి సమయంలో అప్రమంతా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. రైతులు రాత్రివేళ పొలాల్లోకి వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు. ఏనుగుల గుంపు కనిపిస్తే కవ్వింపు చర్యలకు పాల్పడవద్దన్నారు.

### ప్రతి విద్యార్థికీ పాఠ్యపుస్తకాలు



ఎమ్మార్సీలో సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ ఈఓ

సీతంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా పాఠ్యపుస్తకాలు అందేలా చూడాలని డిప్యూటీ ఈఓ పి.నారాయుడు పాఠశాల సిబ్బందికి సూచించారు. స్థానిక ఎమ్మార్సీ కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఇప్పటి వరకు వచ్చిన పుస్తకాలు, పంపిణీ చేసినవి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిరికొండ జీపీఎస్ పాఠశాలను పరిశీలించారు. తొలిరోజు విద్యార్థుల హాజరుశాతాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. డ్రాపౌట్లు లేకుండా చూడాలని, బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.ఆనందరావు, ఏఎంఓ కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ, కోఆర్డినేటర్ జి.ముకుందరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఆ స్కూలే ఓ సైన్యం



సైనిక పాఠశాల విద్యార్థులు

ఆ పాఠశాలలో అడుగుపెడితే.. భరతమాత సేవలో తరించేందుకు ఉవ్విళ్లూరే విద్యార్థి సైన్యం కనిపిస్తుంది. విశాలమైన మైదానం.. అన్ని వసతులతో కూడిన తరగతి గదులు.. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థుల భవిష్యత్తుకు కోరుకొండ సైనిక్ స్కూల్ కొండంత అండగా నిలుస్తోంది. అత్యుత్తమ బోధన, క్రమశిక్షణతో పాటు ఆట పాటలు, యుద్ధ విన్యాసాల్లో ఆరితేరిన విద్యార్థి సైన్యాన్ని దేశ సేవకు సిద్ధం చేస్తున్న సైనిక్ స్కూల్ ప్రత్యేకతలకు 'సాక్షి' అక్షర రూపం.

- రక్షణ దళాల్లో చేరాలనుకునే విద్యార్థులకు సదావకాశం
- ఉత్తమ బోధన అందిస్తున్న కోరుకొండ సైనిక స్కూల్
- క్రమశిక్షణకు మారుపేరు
- గ్రామీణ విద్యార్థులకు వరం

విజయనగరం రూరల్:

కోరుకొండ సైనిక్ స్కూల్‌లో ప్రవేశం పొందితే చాలు.. విద్యార్థి భవిష్యత్తుకు బెంగలేదన్నది తల్లిదండ్రుల మాట. అక్కడ ఒత్తిడితో కూడిన విద్యాబోధన ఉండదు. అవగాహనాయుత విద్యకు ప్రాధాన్యమిస్తారు. పాఠ్యాంశ బోధనతో పాటు విద్యార్థికి ఇష్టమైన రంగాల్లో ప్రత్యేక తర్ఫీదునిస్తారు. విలువల్ని బోధించే పాఠాలు, సాహసాన్ని చదువులో రంగరించే విద్యావిధానం, సామాజిక సేవ, ప్రశాంత వాతావరణం సైనిక పాఠశాల సొంతం. సైనిక శిక్షణ, శారీరక, మానసిక ధారుఢ్యానికి శిల్పశాలగా పాఠశాల పేరొందింది. కోటి ఆశలతో కొత్త ప్రదేశంలోకి అడుగిడిన నూతన విద్యార్థులకు ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణం స్వాగతం పలికడమే కాకుండా, అత్యుత్తమ విద్యాబోధన అందించే ఉపాధ్యాయులు, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచే నిలిచే అధికారుల బృందం, సహ విద్యార్థులు వారికి నాలుగేళ్ల నుంచి ఏడేళ్ల కాలం వరకు తోడుంటారు.

### విద్యార్థులకు వరం..



కోరుకొండ సైనిక పాఠశాల ప్రధాన కార్యాలయ భవనం

విజయనగరం పట్టణానికి పదకొండు కిలోమీటర్ల దూరంలో కోరుకొండ వద్ద 206 ఎకరాల విస్తీర్ణంలో 1961–62 విద్యా సంవత్సరంలో సైనిక పాఠశాల ప్రారంభమైంది. ఇక్కడ ఆరో తరగతి నుండి పన్నెండో తరగతి వరకు బోధిస్తారు. 2021 వరకు సైనిక పాఠశాలలో కేవలం బాలురకే ప్రవేశం. 2023 నుంచి బాలికలకు ప్రవేశం కల్పిస్తూ సైనిక సొసైటీ అవకాశం కల్పిస్తోంది. దేశవ్యాప్తంగా 33 సైనిక పాఠశాలలు ఉండగా అందులో రెండు మన ఆంధ్రప్రదేశ్‌లోనే ఉండడం మన అదృష్టం. మన రాష్ట్రంలోని విద్యార్థులే ఇక్కడ అధికమంది ప్రవేశాలు పొందుతుండగా, ఇతర రాష్ట్రాల విద్యార్థులకూ ప్రాతినిధ్యం ఉంటుంది. సైనిక పాఠశాలలో రక్షణశాఖ అధికారులు ప్రిన్సిపాల్, రిజిస్ట్రార్, ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వర్తించగా మరో 30 మంది వరకు ఉపాధ్యాయ బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఏటా ఆరు, తొమ్మిది తరగతులకు ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులకు పాఠశాలలో ప్రవేశాలు కల్పిస్తారు. బాలికలకు 10 శాతం సీట్లు కేటాయిస్తారు.





సైనిక పాఠశాల ప్రధాన ద్వారం



సాహస క్రీడల్లో

### విద్యార్థి దశ నుంచే సైనిక శిక్షణ



షూటింగ్ శిక్షణలో విద్యార్థులు

కోరుకొండ సైనిక పాఠశాలలో విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు సైనిక శిక్షణకు కొంత సమయం కేటాయిస్తారు. ఇది కూడా ఆటపాటలు ద్వారానే. చదువుతో పాటు ఆత్మ విశ్వాసం, క్రమశిక్షణ నూరిపోయడంతో విద్యార్థుల్లో ధైర్యం నెలకొంటుంది. కోరుకొండ సైనిక పాఠశాలలో ప్రతి విద్యార్థి సైనికుడే. తరగతి గదుల్లో, మైదానాల్లో చదువులన్నీ, శారీరక శిక్షణ, మానసిక వికాసం అంశాల్ని దృష్టిలో ఉంచుకునే సాగుతాయి. అత్యాధునిక బోధన పద్ధతులన్నీ అందుబాటులో ఉంటాయి. విద్యార్థులపై ఉపాధ్యాయుల బృందాల నిరంతర పర్యవేక్షణ నైతిక విలువలు పెంపొందేందుకు తోడ్పడతాయి.



విద్యార్థుల విన్యాసాలు

### అన్ని రంగాలకు ప్రాధాన్యం

సైనిక పాఠశాలలో చదువుతో పాటు ఆటలకు అంతే ప్రాధాన్యం ఉంటుంది. శారీరక శిక్షణకు, సాంస్కృతిక కార్యక్రమాలకు పెద్దపీట వేస్తారు. సైనిక పాఠశాల నుంచి బయటకు వచ్చే ప్రతి విద్యార్థి తనకు ఇష్టమైన రంగంతో పాటు మరో ఐదు రంగాల్లో నిష్ణాతులుగా తయారవుతారంటే అక్కడ ఇతర రంగాలకు ఎంత ప్రాధన్యమిస్తారో అర్థమవుతుంది. ప్రతి విద్యార్థి రెండు క్రీడాంశాల్లో ప్రావీణ్యం సంపాదించి ఉండాలి. ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, వాలీబాల్, స్కేటింగ్, జిమ్నాస్టిక్స్, చెస్, స్విమ్మింగ్, షూటింగ్... వీటిలో వేటినైనా ఎంచుకోవచ్చు. వీటితో పాటు చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ, సంగీతం, నృత్యం, బొమ్మల తయారీ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తారు.

### అత్యుత్తమ సౌకర్యాలకు నిలయం



పూర్వ విద్యార్థులు నిర్మించిన ఇండోర్ స్టేడియం

కోరుకొండ సైనిక పాఠశాలలో దేశంలోని అత్యుత్తమ వసతులన్నీ అందుబాటులో ఉంటాయి. విశాలమైన తరగతి గదులు, క్రీడా మైదానం, ఇండోర్ స్టేడియం, ఈతకొలను, అత్యాధునిక షూటింగ్ రేంజ్, విశాలమైన భోజనశాల, కేంటీన్, సైనిక సీఎస్ఈ కేంటీన్, ఆడిటోరియం, థియేటర్, సైన్స్ ల్యాబ్, ఈ–లైబ్రరీ, స్మార్ట్ బోధన కోరుకొండ సైనిక పాఠశాల సొంతం. అలాగే, విద్యార్థుల వసతికి అనువైన గదులు, బెడ్‌లు అందుబాటులో ఉంటాయి. 24 గంటలూ విద్యుత్ సరఫరా, సీసీ కెమెరాల పర్యవేక్షణలో తరగతుల నిర్వహణ ఉంటుంది.

### ఎన్‌డీఏనే ప్రధాన లక్ష్యం

ఇక్కడ చదివే ప్రతి విద్యార్థి అంతిమ లక్ష్యం నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)లో చేరడమే. అందుకు అనుగుణంగానే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. 1965 నుంచి కోరుకొండ సైనిక పాఠశాల విద్యార్థులు ఏటా ఎన్‌డీఏకు ఎంపికై రక్షణ రంగంలో అధికారులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఏమైనా శారీరక లోపాలున్న విద్యార్థులు రక్షణ రంగంలో ఎంపిక కాకుంటే తమకు ఆసక్తి ఉన్న రంగాల వైపు మొగ్గు చూపుతుంటారు.

### నిధుల కొరత లేదు

కోరుకొండ సైనిక పాఠశాలకు నిధులు కొరత లేదనే చెప్పవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచే అందే నిధులతో పాఠశాలలో సకల సౌకర్యాలు కల్పించారు. 206 ఎకరాల్లో విస్తరించి ఉన్న ప్రాంగణంలో 40 ఎకరాల్లో పాఠశాల, వసతి గృహాలు, సిబ్బంది నివాస సముదాయాలు ఉన్నాయి. 48 ఎకరాల్లో క్రీడా ప్రాంగణం ఉంది. మిగతా 118 ఎకరాల్లో ఆహారధాన్యాలు, కాయగూరలు, పండ్ల ఉత్పత్తులు పండిస్తున్నారు. పాలకేంద్రాన్ని నిర్వర్తిస్తున్నారు.

### అత్యుత్తమ బోధనే లక్ష్యం

పాఠశాలలో చేరిన విద్యార్థులు ఇంటికి దూరంగా ఉన్నామన్న భావన కలగకుండా వారికి నచ్చిన రంగంలో శిక్షణ అందించడంతోపాటు అత్యుత్తమ బోధన అందిస్తాం. విద్యార్థులు ఎంతో క్రమశిక్షణగా ఉండేలా తీర్చిదిద్దుతాం. వారి లక్ష్యాన్ని సాధించేలా తీర్చిదిద్దడమే మా ఆశయం.

– ఎస్.ఎస్.శాస్త్రి, ప్రిన్సిపాల్, కోరుకొండ సైనిక పాఠశాల

### ఎందరో ప్రముఖులు

కోరుకొండ సైనిక పాఠశాలలో విద్యనభ్యశించిన అనేక మంది దేశానికి వివిధ రంగాల్లో సేవలందించి ప్రముఖులుగా స్థిరపడ్డారు. రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు కోరుకొండ సైనికపాఠశాల నుంచి ఐఏఎస్‌కు ఎంపికైన తొలి విద్యార్థి కావడం గమనార్హం. కర్ణాటక కేడర్ ఐఏఎస్ అధికారి చరణ్‌రెడ్డి, ప్రవాస భారతీయ శాస్త్రవేత్త ఎస్.ఆర్.కె.రెడ్డి సైనిక పాఠశాల విద్యార్థులే. అలాగే, భారత దేశ కీర్తిపతాకాన్ని ప్రపంచ నలుమూలల విస్తరింపజేసిన పర్వతారోహకుడు, దివంగత మల్లి మస్తాన్ బాబు సైనిక పాఠశాల విద్యార్థే కావడం విశేషం. అలాగే, గల్వాన్ లోయలో చైనా సైనికులతో వీరోచితంగా పోరాడి అమరుడైన కల్నల్ సంతోష్‌బాబు ఇక్కడి విద్యార్థే. ప్రముఖ తెలుగు సినీ దర్శకుడు కె.విజయభాస్కర్ ఈ పాఠశాలలోనే విద్యనభ్యశించారు. కోరుకొండ సైనిక పాఠశాల విద్యార్థులు (సైకోరియన్లు) ప్రపంచం నలుమూలలా వైద్యులుగా, వివిధ రంగాల్లో నిష్ణాతులుగా పేరుపొందారు.

### పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల ముద్ర

సైనిక పాఠశాలలో విద్యనభ్యశించి వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వేలాది మంది సైకోరియన్లు (పూర్వ విద్యార్థులు) ఏటా పాఠశాలకు వచ్చి తమకు ఉన్నతులుగా తీర్చిదిద్దిన పాఠశాల రుణం తీసుకోవడంలో ముందుంటారు. దేశ విదేశాల్లో వివిధ హోదాల్లో స్థిరపడినా ఏటా జరిగే పాఠశాల వేడుకలకు వచ్చి పాఠశాల అభివృద్ధికి విరాళాలు అందిస్తుంటారు. ఇక్కడ చేరే విద్యార్థులకు పూర్వ విద్యార్థులు నిర్వహించే కార్యక్రమాలు, ప్రముఖులు సాధించిన విజయాలు స్ఫూర్తిగా నిలిస్తాయనడంలో సందేహంలో లేదు.

### అందమైన లోగిలి

సైనిక పాఠశాలలోకి ప్రవేశిస్తుంటే అందమైన లోగిళ్లలోకి వెళ్తున్నామా అన్న అనుభూతి కలుగుతుంది. విశాలమైన రోడ్లు, తీర్చిదిద్దిన ట్లుండే యుద్ధ నమూనాలు, పరిసరాల్లో ఉంటే చెట్లు, తోటలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఆకట్టుకుంటుంది. ఇంతటి మంచి వాతావరణం ఉండబట్టే ఇక్కడ తెలుగు చలన చిత్రాలతో పాటు వివిధ భాషల చిత్రాల చిత్రీకరణ జరిగాయి.



కంప్యూటర్ శిక్షణలో..

# భూములున్నా ఆదాయం అరకొరే..!

- జగన్నాథుని స్థిరాస్తులు 104 ఎకరాలు
- వీరఘట్టంలో 50 ఎకరాలు, పాలకొండలో 54 ఎకరాలు
- ఈ భూములు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి
- నామమాత్రపు లీజులతో ఆర్థిక ఇబ్బందులు
- పేరుకుపోయిన లీజు బకాయిలు
- పంట పొలాల లీజును బహిరంగ వేలం నిర్వహించని అధికారులు

వీరఘట్టం: వీరఘట్టం మండలం చిదిమి రోడ్డులో ఉన్న ప్రవేటు భూములను ఏడాదికి ఒక ఎకరా భూమిని రూ.35 వేలు నుండి రూ.40 వేలుకు కొందరు కౌలుదారులు లీజుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. ఇదే రోడ్డులో కొంత దూరంలో ఉన్న వీరఘట్టం శ్రీ జగన్నాథస్వామి ఆలయ భూములు సుమారు 24.5 ఎకరాలు ఉన్నాయి. వీటిని అధికారులు ఎకరా భూమికి రూ.6 వేల నుంచి రూ.8 వేలకు లీజుకు ఇచ్చారు. అంటే ఎంత వ్యత్యాసం ఉందో చూశారా... ఈ గుడికి వీరఘట్టం, పాలకొండ, వంగర మండలాల్లో సుమారు 50 ఎకరాలు పైబడి భూములు ఉన్నాయి. వాస్తవంగా అయితే లీజులు ఏడాదికి రూ.15 లక్షలు వరకు రావాలి. అయితే, ఈ లీజులు కనీసం రూ.3 లక్షలు కూడా రావడం లేదు. లీజులు అంతంతమాత్రమే కావడంతో దేవుడి మాన్యం కూడా అంతంతగానే ఉంది. ఈ ఆలయ భూములపై వస్తున్న అరకొర రాబడి కూడా సక్రమంగా దేవుడికి చేరడం లేదు. మధ్యవర్తులు, లీజుదారుల చేతిలో భూమికి రావాల్సిన లీజు డబ్బులు సక్రమంగా చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి.



వీరఘట్టంలో వెలసిన జగన్నాథస్వామివారు



వీరఘట్టంలో దేవదాయ శాఖ భూమిలో సాగులో ఉన్న పూలతోట

**ఇక్కడా అంతే...**

పాలకొండ నగరపంచాయతీలో ఉన్న జగన్నాథ స్వామి ఆలయంకు సుమారు 54 ఎకరాల భూములు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఎంతో విలువైన ఈ భూములకు ఎకరాకు రూ.8 వేలు చొప్పున రూ.4.32 లక్షలు రావాల్సి ఉంది. ఇక్కడ కూడా లీజు డబ్బులు సక్రమంగా అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆలయ నిర్వహణ బారంగా మారుతోంది. చివరకు ప్రభుత్వం ఇస్తున్న నిధులతో ఆలయ నిర్వహణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేవదాయశాఖ అధికారులు దేవుడు కళ్లకు గంతలు కట్టి ఆక్రమణదారులుకు అండగా నిలుస్తుండం వల్లే కౌలు సరిగా వసూలు కావడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఇదీ పరిస్థితి....**

వీరఘట్టం జగన్నాథస్వామి ఆలయానికి వీరఘట్టంలో 5 ఎకరాలు, సీఎస్ఆర్ పేటలో 24.50 ఎకరాలు, వెంకమ్మపేట వద్ద 2 ఎకరాలు, కంబరలో 2.5 ఎకరాలు, కుంబిడిలో ఒక ఎకరా, కత్తులకవిటిలో 1.5 ఎకరాలు, వంగర మండలం శివ్వాంలో ఎకరా, పాలకొండ మండలం అవలంగిలో ఎకరా, మరి కొన్ని ప్రాంతాల్లో మరో 12 ఎకరాల భూములు ఉన్నాయి. ఈ భూములు లీజుకు తీసుకున్న కొంత మంది లీజుదారులు ఏటా పంటలను సాగు చేసుకుంటూ ఫలసాయం పొందుతున్నా కొందరు కౌలుదారులు దేవదాయ శాఖకు లీజు చెల్లించడం మానేశారు. గతేడాది ఖరీఫ్‌లో పంటలు పండలేదని, కొందరు ఈ ఏడాది లీజులు కూడా చెల్లంచలేదని అధికారులు అంటున్నారు. కౌలు చెల్లించని భూములను వదిలేయాలని అధికారులు చెబుతున్నప్పటికీ లీజుదారులు అంగీకరించడం లేదు. మరి కొన్ని చోట్ల సొంత భూములుగా భావించి ఇంకొకరికి లీజులకు ఇస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. పాలకొండలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో దేవుడు భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని భక్తులు అంటున్నారు. దేవదాయశాఖ అధికారులు జగన్నాథుని భూములను రక్షించాలని కోరుతున్నారు. జగన్నాథస్వామి ఆలయాల నిర్వహణ భారం లేకుండా ఆదాయం రాబట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధిక కౌలు వచ్చేలా భూములను బహిరంగ వేలం వేసి అప్పగించాలని సలహా ఇస్తున్నారు.



సుమారు 50 ఎకరాల భూములున్న వీరఘట్టం జగన్నాథస్వామి ఆలయం

**గతంలో ఇలా ..**

ఒక రైతు వద్ద కేవలం మూడేళ్ల మాత్రమే భూములను లీజుకు ఉంచాలి. అనంతరం మరో రైతుకు మార్చాలి. గతంలో అధికారులు మాత్రం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ ఆలయం పరిధిలోని అధికారుల లోపాయికారి సహకారంతో ఒకే రైతు వద్ద ఏళ్ల తరబడి భూములను వదిలేయడంతో ఇటువంటి పరిస్థితి కనిపిస్తోంది. ఆలయ భూములను బహిరంగ వేలం వేయకపోవడంతో ఆక్రమణ విషయంలో సిబ్బంది ప్రమేయం కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

### బహిరంగ వేలం వేస్తాం

వీరఘట్టం, పాలకొండలో ఆలయాలకు ఉన్న భూములపై లీజు బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలు కట్టనివారిపై శాఖపరంగా చర్యలు తీసుకుంటాం. ఇకపై ఈ ఆలయాల భూములకు బహిరంగ వేలం వేసి దేవుడు ఆస్తుల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపడతాం.

– డీవీవీ ప్రసాదరావు, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, పార్వతీపురం మన్యం జిల్లా

### త్వరితగతిన సీట్లు భర్తీ చేయాలి

- జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి మహ్మద్ గయాజుద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి మహ్మద్ గయాజుద్దీన్

పార్వతీపురం టౌన్: జిల్లా సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల్లోని మిగులు సీట్లను త్వరితగతిన భర్తీ చేయాలని ఆ శాఖ సంక్షేమ అధికారి గయాజుద్దీన్ అధికారులను ఆదేశించారు. ఏఎస్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో వసతి గృహ అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వసతి గృహంలో ప్రవేశం పొందిన ప్రతి ప్రీ మెట్రిక్ విద్యార్థికి టంకుపెట్టె, కంచం, గిన్నె, గ్లాసు, దుప్పటి, స్టేషనరీ తదితర వస్తువులు అందజేయాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతినెల వైద్య పరీక్షలు చేయించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ పంపిణీ చేయాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ప్రతినెల సలహా సంఘ సమావేశం నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల వ్యక్తిగత అవసరాల నిమిత్తం తల్లిదండ్రుల ఖాతాల్లో కాస్మోటిక్ నిధులు జమచేస్తామని చెప్పారు. వసతి గృహంలో పదోతరగతి విద్యార్థులకు ట్యూటర్లతో ప్రతిరోజూ శిక్షణ అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వసతి గృహ అధికారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కామాక్షమ్మా.. కరుణించమ్మా..

● ఘనంగా కామాక్షి అమ్మవారి దేవాలయం పంచమ వార్షికోత్సవం


భక్తుల పూజలందుకుంటున్న కామాక్షీదేవి

విజయనగరం: జ్యేష్ఠ శుద్ధ సప్తమి సందర్భంగా బొండాడ వీధిలో వేంచేసిన మహాగణపతి కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి ఆలయ పంచమ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు అప్పలబత్తుల సోమరాజు పర్యవేక్షణలో వేకువజాము నుంచి స్వామివారికి పంచామృతాభిషేకం, అలంకరణ, కలశస్థాపన, అర్చన, భూపుర శ్రీ చక్ర అలంకరణ, దేవి దేవతా మూర్తుల ఆవాహనం, మూలమూర్తులకు ప్రత్యేక వస్త్ర ఆభరణ అలంకరణ, సువాసినిలతో శ్రీచక్ర సహస్ర కుంకుమార్చన, లలితాపారాయణం, హరే శ్రీనివాస్ బృందం కోలాట ప్రదర్శన లు భక్తిశ్రద్ధలతో సాగాయి. సాయంత్రం కామాక్షి దే వి ఏకాంబరేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్స వం ఆలయ ప్రధాన అర్చకుడు బ్రహ్మశ్రీ లక్కోజు ఓంకార్ ఆచార్య సిద్ధాంతి వేదమంత్రాల సాక్షిగా జరిపించారు. అమ్మవారిని 108 చీరలతో అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి గౌరవాధ్యక్షుడు లోకనాథ గణపతి, ఉపాధ్యక్షుడు కాకినాడ శశిభూషణరావు, అలమండ పాపయ్య శాస్త్రి, మందరపు వరహాచారి, పురోహితులు మణికంఠ శాస్త్రి, ఆలయ అర్చకులు గంగాధారాచారి, వెంకటరమణాచారి పాల్గొన్నారు.

### కుళాయిల ట్యాప్‌లు మాయం

● పోలీసులకు ఫిర్యాదు చేసిన ఊటపల్లి పాఠశాల సిబ్బంది, ప్రజలు


ఆకతాయిలు దొంగిలించిన కుళాయిల ట్యాప్‌లు

మెరకముడిదాం: రోజురోజుకూ ఆకతాయిల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. మండలంలోని ఊటపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఉన్న తాగునీటి ట్యాపులు, మరుగుదొడ్ల ట్యాప్‌లు అపహరించడంతో పాటు పరిసరాలను చిందరవందర చేశారు. గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల ఆవరణ చిందరవందరగా ఉండడం, ట్యాప్‌లు మాయం కావడం గమనించారు. వెంటనే బుధరాయవలస పోలీసులకు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.

### జూదరుల అరెస్ట్

పాలకొండ రూరల్: నగరంలోని గారమ్మకాలనీ శివారులో జూదమాడుతున్న ఏడుగురిని ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ అరెస్ట్ చేశారు. విజుబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా శివారు ప్రాంతాల్లో గురువారం సాధారణ తనిఖీలు చేస్తుండగా పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. వారి నుంచి 5,760 రూపాయల నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


108 వాహనంలో క్షతగాత్రులు

రాజాం సిటీ: మండల పరిధి అంతకాపల్లి సమీపంలో గురువారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం గెడ్డకంచరాం గ్రామానికి చెందిన నక్క సత్యం తన పొలంలో పండిన కూరగాయలను రాజాంలో విక్రయించేందుకు అదే గ్రామానికి చెందిన నక్కిన దిలీప్‌కుమార్ ఆటోలో తరలిస్తున్నాడు. అంతకాపల్లి వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇద్దరూ గాయపడ్డారు. వెంటనే స్థానికులు గమనించి 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రాజాంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ ఎస్.కృష్ణంనాయుడు తెలిపారు.

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹140 | ₹250 | ₹260 |

# 'సిరి'ధాన్యాలు

● చిరుధాన్యాలతో ఆరోగ్యంతో పాటు ఆదాయం
● సాగుకు ముందుకు వస్తున్న రైతులు
● వీటి ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్
● జిల్లాలో 800 హెక్టార్లలో సాగు


చోడి పంట


కొర్ర పంట

విజయనగరం ఫోర్ట్: ఆహారపు అలవాట్లలో మార్పులు రావడంతో ప్రజలు తక్కువ వయసులోనే వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారు. ఎటువంటి పోషకాలు లేని ఆహారాన్ని నేడు మనం తింటున్నాం. మన పూర్వీకుల విషయానికొస్తే అందుబాటులో ఉండే పౌష్టికాహారాన్ని తిని ఎంతో ఆరోగ్యంగా జీవించేవారు. వరి వంటి నీటి ఆధారిత పంటలు పండకపోయినా ఆరుతడి పంటలైన చోడి, ఊద, కొర్ర, సామ, వరిగ, ఆరికలు వంటి పంటలు సాగు చేసి ఆహార కొరత లేకుండా చేసుకునేవారు. ఇటువంటి చిరుధాన్యాలు తినడం వల్ల ఆరోగ్యానికి మేలు తప్ప ఎటువంటి హాని ఉండదు. అయితే మారుతున్న కాలగమనంలో మళ్లీ చిరుధాన్యాలకు డిమాండ్ ఏర్పడింది. చిరుధాన్యాల వల్ల కలిగే ఉపయోగాలను వైద్యులు, నిపుణులు వివరిస్తుండడంతో రైతులు కూడా వీటి సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. కొంతమంది చిరుధాన్యాలను నేరుగా తింటుండగా.. మరి కొంతమంది చిరుధాన్యాలను పొడర్‌గా చేసి అంబలి చేసుకుని తాగుతున్నారు. ఒక విధంగా చెప్పాలంటే నేటి తరం వారు కూడ మరలా పూర్వకులు తీసుకునే ఆహారం పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. అది ఆరోగ్యకరంగా ఉండడం, వైద్యులు సైతం చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని చెప్పడంతో ఎక్కువ మంది తింటున్నారు. అయితే చిరుధాన్యాలు తక్కువ నీటితో పండించవచ్చు. అంతేకాకుండా అధిక దిగుబడి కూడా వస్తుంది.

**కొర్ర పంట..**

ఎకరానికి 2 కిలోల విత్తనం సరిపోతుంది. ఈపంట ను ఖరీఫ్‌లో జూన్, జూలై నెలల్లోను, వేసవిలో అయితే జనవరి నెలలో వేసుకోవాలి. తేలికపాటి, నల్లరేగిడి నేలలో పండించవచ్చు.

**కొర్రలో రకాలు..**

ప్రసాద్ రకం 70 నుంచి 75 రోజుల్లో పండుతుంది. కృష్ణదేవరాయ రకం 80 నుంచి 85 రోజుల్లో పండుతుంది. నరసింహా, శ్రీ లక్ష్మి రకాలు కూడా 80 నుంచి 85 రోజుల్లో పండుతాయి.

**ఎరువులు**

ఎకరాకు 20 కిలోల నత్రజని, 30 కిలోల పొటాష్ వేయాలి. పంట సాగు చేయడానికి ముందు రెండు టన్నుల పశువుల గత్తాన్ని వేయాలి.

**సామలు**

ఈపంటకు తేలికపాటి ఎర్రటి ఇసుక నేలలు అనుకూలం. ఈ పంటను జూన్, జూలై నెలల్లో విత్తుకోవాలి. విత్తనం వరుసలో వేయటకు రెండు కిలోలు, వెద జల్లుటకు ఐదు కిలోల విత్తనాలు అవసరం.

ఎరువులు: నత్రజని ఎరువులు 10 కిలోలు, భాస్వరం 10 కిలోలు, పొటాష్ 10 కిలోలు వేసుకోవాలి. పశువుల గత్తం 2 టన్నులు విత్తడానికి ముందు ఎకరానికి వేసుకోవాలి.

విత్తన రకాలు: కో-2, బీఎల్ఎం 203 రకాలు. ఈ రకాలు 80 నుంచి 85 రోజుల్లో పండుతుంది. బీఎల్ఎం-36 ,బీఎల్ఎం-26 రకాలు 90 నుంచి 100 రోజుల్లో పండుతాయి.

**ఊదలు..**

ఈ పంటను జూన్, జూలై నెలల్లో వేసుకోవాలి. వరుసలలో వేయడానికి ఎకరానికి రెండు కిలోలు, వెదలకు ఐదు కిలోల విత్తనం అవసరం.

**ఎరువులు..**

విత్తనం వేయడానికి ముందు రెండు టన్నుల పశువుల గత్తం వేసుకోవాలి. సాగు చేపట్టిన తర్వాత 10 కిలోల నత్రజని, 10 కిలోల పొటాష్, 10 కిలోల భాస్వరం ఎరువులు వేసుకోవాలి.

విత్తన రకాలు: వీఎల్-230 రకం 90 రోజుల్లో పంటకు వస్తుంది. వీఎల్-172 రకం 90 నుంచి 95 రోజుల్లో పండుతుంది. వర్షాభావ పరిస్థితులను తట్టుకుంటాయి.

**వరిగలు**

ఈ పంటను కూడా జూన్, జూలై మాసాల్లో విత్తుకోవాలి. వరుసలలో విత్తుకోవాడానికి కిలో విత్తనం, వెద జల్లుకోవాడానికి మూడు కిలోల విత్తనం సరిపోతుంది.

ఎరువులు: విత్తనం వేయడానికి ముందు పశువుల గత్తం రెండు టన్నులు వేయాలి. సాగు చేపట్టిన తర్వాత 10 కిలోల పొటాష్, 10 కిలోల నత్రజని, 10 కిలోల పొటాష్ ఎరువులు వేసుకోవాలి.

**విత్తన రకాలు**

టీఎన్, ఏయూ 145 రకాలు 75 నుంచి 80 రోజుల్లో పండుతాయి. జేపీయూ పి రకం 70 నుంచి 75 రోజుల్లో పండుతాయి. వర్షాభావ పరిస్థితులను తట్టుకుంటాయి.

**చోడి..**

ఈ పంటను ఖరీఫ్‌లో అయితే జూలై , ఆగస్టు నెలల్లో.. రబీలో నవంబర్, డిసెంబర్ నెలల్లో .. వేసవిలో జనవరి, ఫిబ్రవరి నెలల్లో విత్తుకోవాలి.

**రకాలు..**

హిమ: ఇది తెల్ల చోడి రకం. అగ్గి తెగులను తట్టుకుట్టుంది. 105-110 రోజుల్లో పండుతుంది.

శ్రీచైతన్య: ఖరీప్‌లో వేసుకోవాలి. 110 నుంచి 115 రోజుల్లో పండుతుంది.

**ఎరువులు**

ఎకరానికి నాలుగు టన్నుల పశువుల ఎరువు ఆకిరి దుక్కిలో వేసి కలియ దున్నాలి. ఎకరాకు 12 కిలోల నత్రజని , 12 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్ నాటేటప్పుడు వేయాలి. నాటిన 30 రోజులకు మరో 12 కిలోల నత్రజని పైపాటుగా వేయాలి.

**చిరుధాన్యాల్లో ఉండే పోషకాల వివరాలు..**

| పోషకాలు | క్యాలరీలు (గ్రాముల్లో) |
|---|---|
| పీచు పదార్థాలు | 64.16 |
| ప్రొటీన్ | 14.12 |
| సోడియం | 5 |
| కాల్షియం | 47 |
| ఐరన్ | 4.57 |
| మెగ్నిషయం | 197 మిల్లీ గ్రాములు |
| భాస్వరం | 457 మిల్లీ గ్రాములు |

**తక్కువ నీటితో పంటలు..**

చిరుధాన్యాల సాగుకు తక్కువ నీరు సరిపోతుంది. ఆడపా, దడపా వర్షాలు కురిసినా పంట చేతికొస్తుంది. చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. ప్రతిఒక్కరూ వీటిని తినడానికి ఆసక్తి చూపుతున్నారు.

వి. తారకరామారావు, జిల్లా వ్యవసాయాధికారి

## ప్రమాదకర ప్రయాణం

ఇద్దరు ప్రయాణించేందుకు వీలుపడే బండిపై నలుగురు ప్రయాణించడాన్ని చూసిన వారు గగుర్పాటుకు గురయ్యారు. ఈ ప్రయాణం ప్రమాదకరం మిత్రమా అంటూ పలువురు సలహా ఇచ్చారు. అయితే, యువకులు మాత్రం వారి మాటలు పట్టించుకోకుండా విజయనగరం పట్టణంలోని మూడులాంతర్ల కూడలిలో గురువారం ఇలా ప్రమాదకర రీతిలో ముందుకు సాగిపోయారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


దనపతి బాలకృష్ణ (ఫైల్)

వీరఘట్టం: మండలంలోని బూరుగ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ దనపతి బాలకృష్ణ (38) చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఏఎస్సై కృష్ణంనాయుడు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలకృష్ణ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈయనకు మద్యం అలవాటు ఉండడంతో తల్లి, భార్య ఎప్పటికప్పుడు మందలిస్తుండేవారు. ఈనెల 11న కూడా బాలకృష్ణ మద్యం మత్తులో ఇంటికి రావడంతో భార్య, తల్లి మందలించారు. దీంతో ఆయన చనిపోతానని కుటుంబ సభ్యులను బెదిరించి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. గతంలో పలుమార్లు ఇలానే బెదిరించి ఇంటికి చేరుకోవడంతో.. ఈ సారి కూడా బాలకృష్ణ మళ్లీ ఇంటికి వస్తాడని కుటుంబ సభ్యులు భావించారు. అయితే మరుచటి రోజు గ్రామ సమీపంలోని పంట పొలాల్లో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్న బాలకృష్ణను స్థానికులు గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని బాలకృష్ణను స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పాలకొండ ఏరియా ఆస్పత్రికి, తర్వాత శ్రీకాకుళం జెమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బాలకృష్ణ మృతి చెందాడు. మృతుడి తల్లి అన్నపూర్ణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై కృష్ణంనాయుడు తెలిపారు. మృతుడికి భార్య భవానీ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## పక్షపాతం తగదు...


ఉపాధిహామీ కార్యాలయం ముందు బైఠాయించిన వేతనదారులు

● ఉపాధి అధికారుల తీరును తప్పుబట్టిన నరసాపురం వేతనదారులు
● కార్యాలయాన్ని ముట్టడించి నిరసన

రామభద్రపురం: మేట్‌ల ఫోన్‌లలో వేతనదారుల మస్టర్లకు సంబంధించిన యాప్‌లను తొలగించడంతో పాటు తాము వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల మనే ఉద్దేశంతో ఉపాధి అధికారులు పక్షపాతం చూపిస్తున్నారని మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన వేతనదారులు ఆరోపించారు. ఈమేరకు గురువారం స్థానిక ఉపాధి కార్యాలయాన్ని ముట్టడించారు. వివరాల్లోకి వెళితే... రెండేళ్లుగా ఆ గ్రామానికి ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో వేతనదారుల మస్టర్లు, ఫేస్ అథెంటికేషన్ వేసే బాధ్యత నలుగురు సీనియర్ మేట్‌లకు అప్పగించారు. అయితే ఆ నలుగురులో ఇద్దరు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కాగా మరో ఇద్దరు టీడీపీ మద్దతుదారులు. వీరిలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు సంబంధించి వారం రోజుల కిందట ఒకరి ఫోన్‌లో యాప్‌ను, తాజాగా గురువారం మరో మేట్ ఫోన్‌లో యాప్‌ను తొలగించారు. ఇద్దరి మేట్ల ఫోన్లలో యాప్‌లు తొలగించడంతో మస్టర్లు వేయడానికి ఇబ్బందులేర్పడుతుండడంతో సుమారు 150 మంది వేతనదారులు ఉపాధి కార్యాలయాన్ని ముట్టడించారు.


ఏపీఓ త్రినాథరావును చుట్టిముట్టిన వేతనదారులు

**ఏపీఓ నిలదీత..**

ఏపీఓ త్రినాథరావు కార్యాలయానికి చేరుకోగానే వారంతా ఆయన్ను చుట్టుముట్టారు. మీరే మేట్‌ల ఫోన్‌లలో ఉన్న యాప్‌లను తొలగించి, టీడీపీ వారికి వత్తాసు పలుకుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతలో ఎంపీడీఓ ఈశ్వరమ్మ కార్యాలయానికి చేరుకుని వేతనదారులకు సర్ది చెప్పారు. ఏ సమస్య ఉన్నా తాను స్వయంగా పరిష్కరిస్తానని చెప్పడంతో వేతనదారులు శాంతించారు. గ్రామానికి వెళ్లి వేతనదారులతో సమావేశమై సమస్య పరిష్కరించాలని ఏపీఓ త్రినాథరావును ఆదేశించారు.

## మరో సైబర్ మోసం

● తెలియని వ్యక్తికి డబ్బులు చెల్లించి మోసపోయిన అర్చకుడు

విజయనగరం క్రైమ్: సైబర్ మోసాలు రోజురోజుకూ ఎక్కువవుతున్నా ఇంకా ప్రజల్లో చైతన్యం రావడం లేదు. ఆన్‌లైన్‌లో ఎవ్వరు డబ్బులు అడిగినా.. యాప్‌లు, లింక్‌ల ద్వారా ఏటీఎం, బ్యాంక్ ఖాతా సమాచారం కోరినా ఎవ్వరూ స్పందించవద్దని పోలీసులు అవగాహన కల్పిస్తున్నా ఇంకా మోసాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా మరో ఆన్‌లైన్ మోసం వెలుగుచూసింది. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు గురువారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కోట వద్దనున్న మూడు కోవెళ్లలో పనిచేస్తున్న అర్చకుడు వేణు చిరంజీవి ఇన్‌స్టాగామ్‌లో వచ్చిన రవియాదవ్ రిక్వెస్ట్‌ను యాక్సెప్ట్ చేశాడు. తాను ఒంగోలు ఆర్‌ఎంఎస్ మెడికల్ క్లబ్‌లో పనిచేస్తున్నానని.. తాను పంపించిన లింక్‌ను ఓపెన్ చేస్తే భారీగా డబ్బులు వస్తాయని రవియాదవ్ బాధితుడ్ని నమ్మించాడు. దీంతో అర్చకుడు వేణు చిరంజీవి మోసగాడు పంపించిన లింక్ ఓపెన్ చేసి అతడికి రూ. 1800, రూ.3000 చొప్పున మొత్తం రూ. 2.60 లక్షలు పంపించాడు. కొన్ని రోజులకు తాను మోసపోయానని గ్రహించిన అర్చకుడు మోసగాడికి ఫోన్ చేసి నిలదీయగా.. మరోసారి ఫోన్‌చేసినా, డబ్బులు అడిగినా చంపేస్తానని బెదిరించాడు. దీంతో బాధితుడు వేణుచిరంజీవి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## రక్తదానంతో పునర్జన్మ..

● అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందించి ప్రాణదాతలుగా నిలుస్తున్న యువత
● నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం


జీఎంఆర్ నైరెడ్‌లో రక్తదానం చేస్తున్న యువకులు

రాజాం సిటీ: మనిషి ప్రాణాలు నిలబెట్టి పునర్జన్మనిచ్చే రక్తదానం కంటే మించినది మరొకటి లేదు. ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ స్పందించి రక్తందానం చేసి ప్రాణదాతలు కావచ్చు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు విడుస్తున్నారు. అయితే ప్రస్తుతం సేకరిస్తున్న రక్తం నిల్వలు కూడా సరిపోవడం లేదు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో మేమున్నామంటూ కొంతమంది రక్తదాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయం. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...

**ప్రాణంతో సమానం....**

ప్రమాదాల్లో గాయపడిన వారికి, అత్యవసర చికిత్సలు అవసరమైన వారికి రక్తం ఎంతో అవసరం. రక్తాన్ని ఒకరి నుంచి మరొకరికి అందించాల్సిందే కానీ కృత్రిమంగా తయారుచేయలేం. అందుకే రక్తదానం ప్రాణదానంతో సమానం అని చెబుతారు. ఒకరి రక్తం మరొకరి ఆయుష్షు కాపాడుతుంది. రక్తానికి పేద, ధనిక అనే భేదాలుండవు. ఒక మనిషి రక్తం మరో మనిషి ప్రాణాలు కాపాడుతుందని తెలిసినా చాలా మంది రక్తదానం చేయడానికి భయపడుతున్నారు. కొంతమంది మాత్రం ఎప్పుడు రక్తం అవసరం వచ్చినా మేమున్నామంటూ ముందుకొస్తున్నారు.

**రక్తదానానికి వీరు అర్హులు....**

● 18 నుంచి 60 ఏళ్లలోపు వయసు, 50 కిలోల బరువు కలిగి ఆరోగ్యంగా ఉన్నవారు.
● హిమోగ్లోబిన్ శాతం 12.5 లోపున్నవారు.
● చికెన్‌గున్యా, టైఫాయిడ్, మలేరియా, ఇతర వ్యాధులు సోకిన వారు కోలుకున్న నాలుగు నుంచి ఆరు నెలల తర్వాత నుంచి రక్తదానం చేయవచ్చు.
● దాతల నుంచి కేవలం 300 మిల్లీ లీటర్ల రక్తాన్ని మాత్రమే సేకరిస్తారు.
● రక్తాన్ని సేకరించే ముందు వైద్యులు దాత ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తారు.

**వీరు అనర్హులు..**

● మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్న వ్యక్తులు.
● కంటి జబ్బులు, కంటి కలక వంటివి ఉన్నప్పుడు రక్తదానం చేయవద్దు.

### 49 సార్లు రక్తదానం చేశా.....



ఇప్పటి వరకు శిబిరాల ద్వారా, స్వచ్ఛందంగా 49 సార్లు రక్తదానం చేశాను. ఆపదలో ఉన్న వారికి ఇలా ఉపయోగపడడం చాలా సంతోషంగా ఉంది. రక్తదానం చేయడం ద్వారా ఎంతో ఆరోగ్యంగా ఉన్నాను. ఎవరికైనా ఏ సమయంలో అవసరమైనా రక్తం ఇచ్చేందుకు నేను సిద్ధం. త్వరలో 50వ సారి రక్తదానం చేయనున్నాను.

– శనపతి రాము, రక్తదాత, పొగిరి.

### యువత సహకారం అవసరం..



రక్త నిల్వలు పూర్తిగా తగ్గుముఖం పట్టకుండా ఉండాలంటే యువత సహకారం ఎంతైనా అవసరం. యువత స్వచ్ఛందంగా ముందుకువచ్చి రక్తదానం చేయాలి. రక్తం అందక ఎవరూ చనిపోకూడదనే ఉద్దేశంతో యువతకు అవగాహన కల్పించి శిబిరాలు నిర్వహిస్తున్నాం. రక్తదానం కుటుంబ సంప్రదాయంలా మారాలి.

– పెంకి చైతన్యకుమార్, రెడ్‌క్రాస్ సభ్యుడు, రాజాం.

### ప్రతి ఏటా రక్తదాన శిబిరం ..



ఇది ఒక మహత్తరమైన కార్యక్రమం. ప్రతి ఏడాదీ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నాం. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా అవగాహన కల్పిస్తున్నాం. గ్రామీణ ప్రాంత యువత అపోహలు వీడి ఎక్కువగా రక్తదానానికి ముందుకు రావాలి. అప్పుడే రక్తం కొరతను నివారించేందుకు అవకాశం ఉంటుంది.

– డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, ప్రిన్సిపాల్, జీఎంఆర్ ఐటీ, రాజాం.

### అపోహలు వీడాలి.......



రక్తదానం చేయడం వల్ల ఏదో అయిపోతుందనే అపోహలు వీడాలి. ఆరోగ్యవంతంగా ఉండి 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు వారు ఎవరైనా రక్తదానం చేయవచ్చు. ఇప్పటివరకు పది సార్లు రక్తదానం చేశా. ఎటువంటి సమస్యలు తలెత్తలేదు. ప్రస్తుత తరుణంలో యువత ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గార రవిప్రసాద్, ప్రముఖ వైద్యుడు రాజాం.